క్లుప్తంగా

శిద్దా సుధీర్‌కు అభినందన


శిద్దా సుధీర్‌ను అభినందిస్తున్న సంజయ్ కర్కాల

ఒంగోలు: తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యునిగా బాధ్యతలు స్వీకరించిన శిద్దా సుధీర్‌కుమార్‌ను ఎల్ అండ్‌టీ కనస్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ బిజినెస్ డివిజన్ జనరల్ మేనేజర్ సంజయ్ కర్కాల అభినందించారు. గురువారం సుధీర్‌ను ఆయన కార్యాలయంలో కలుసుకున్నారు. జనరల్ మేనేజర్ మనీష్‌కుమార్, జోనల్ మేనేజర్ అశోక్‌కుమార్, టెర్రిటరీ మేనేజర్ అరుణ్‌మిత్ర, ఎర్త్ మూవర్స్ వర్మ, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ


తనిఖీ చేస్తున్న కేంద్ర బృందం

ఒంగోలు అర్బన్: పౌర సరఫరాలకు సంబంధించి జిల్లా కేంద్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను కేంద్ర బృందం జీఎస్ శర్మ ఆధ్వర్యంలో గురువారం తనిఖీ చేశారు. సివిల్ సప్లయిస్ డీఎం గ్లోరియాను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోదాము డీటీ గంగాధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు ఆంజనేయనాయక్, ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, రామనారాయణరెడ్డి, దేవిడ్‌రాజు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వూతకోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్


విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

ఒంగోలు: స్థానిక మాంటిస్సోరి స్కూలులో గురువారం హిందీ దివస్ కార్యక్రమం ఘనంగా జరిగింది. వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ శబరీనాథ్ హిందీ భాషాభివృద్ధి కోసం సూచనలను ఇచ్చారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రిన్సిపాల్ నూరుద్దీన్, వైస్ ప్రిన్సిపాల్ నరేష్‌బాబు, హిందీ ఉపాధ్యాయులు మల్లిఖార్జునరావు, రంగా రాజ్యలక్ష్మి, కల్పన, మాధవీలత, లక్ష్మి, తులసి, దేవిక పర్యవేక్షించారు.

ఘనంగా సర్వోత్తమరావు జయంతి


ఉద్యమకారుడు సర్వోత్తమరావుకు నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు

ఒంగోలు మెట్రో: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రకాశం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మీ ఆధ్వర్యంలో ఉద్యమకారుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు 140వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి మాట్లాడుతూ గ్రంథాలయాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, ఆంజనేయులు, కార్యాలయం సిబ్బంది జి.శాంసన్, కృష్ణవేణి, గ్రంథాలయం పాఠకులు, శ్రీనివాసులు, సంపూర్ణ, ఇమ్మనియేలు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ


కొత్తపట్నం హైస్కూల్‌ను తనిఖీ చేస్తున్న డిప్యూటీ ఈవో, బృందం

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈవో రోజారాణి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 34 సెక్షన్లలో 1,398 మంది విద్యార్థుల నోటు పుస్తకాలు, వర్కు బుక్‌లు, డైరీలు పరిశీలించారు. ఈ రోజు నాటికి సిలబస్ పూర్తి చేశారా అరా తీశారు. రికార్డులు, ఉపాధ్యాయులు హాజపట్టిక, నాడు–నేడు నిర్మాణం జరుగుతున్న నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. బాత్ రూములు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బృందంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, స్థానిక హెచ్‌ఎం పాలేటి సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుణ సదుపాయంతో అభివృద్ధి


గమళ్ళపాలెంలో అవగాహన కల్పిస్తున్న బసవశంకరావు

గమళ్ళపాలెం (కొత్తపట్నం): పాల రైతుల జీవనోపాధులు మెరుగుపరచడానికి రుణ సదుపాయాలు కల్పిస్తూ రుణ మేళ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డు బసవ శంకరావు అన్నారు. గమళ్ళపాలెంలో గురువారం జాతీయ లైవ్‌స్టాక్ మిషన్‌లో భాగంగా లోన్ మేళా–జగనన్న పాల వెల్లువ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి రుణ మేళా నిర్వహించడం ద్వారా మహిళలకు సామాజికంగా, ఆర్థికంగా ఎదగటానికి తోడ్పడుతుందన్నారు. గతంలో గేదె పాలు లీటరు రూ.58 ఉన్న ధర రూ.88 చేరిందన్నారు. అమూల్ పాల కేంద్రంలో 200 లీటర్లు కంటే ఎక్కువ పోస్తే అదనంగా రూ.2.25 ఇస్తున్నారని తెలిపారు. ఎంపీడీవో పి.సుజాత మాట్లాడుతూ గమళ్ళపాలెంలో పాల సేకరణ తక్కువగా వస్తున్నాయని వారం రోజుల్లో పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అమూల్ పాల కేంద్రంలో పాలు పోసే ఉత్పత్తి దారులకు, రైతులకు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు. ప్రతి డ్వాక్రా మహిళ పాల రైతులకు గేదె కొనుగోలుకు రూ.50 వేలు శ్రీనిధి, సీఐఎఫ్ రుణం మంజూరు చేస్తామన్నారు. వైఎస్సార్ చేయూత, బ్యాంక్ లోన్ ద్వారా గేదెలు కొనుగోలుకు రూ.75 వేలు గ్రౌండింగ్ చేస్తామని చెప్పారు. పశువైద్యాధికారి ఆషా మాట్లాడుతూ పీఎం కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా వర్కింగ్ క్యాపిటల్ కింద రూ.30 వేలతో పాటు దాణామృతం అందిస్తామన్నారు. పాల వెన్న శాతం పెరగడానికి ఎటువంటి దాణా పెట్టుకోవాలో వివరించారు. వైఎస్సార్ పశు వాహన సేవ వాహనం 1962కు ఫోన్ చేస్తే పశువుల ప్రాణాన్ని రక్షించుకును అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. ఆప్కా సెబ్ కోఆపరేటివ్ శాఖ ద్వారా గేదెలు కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు. పీడీసీసీ మెయిన్ బ్రాంచ్ సూపర్ వైజర్ రామారావు మాట్లాడుతూ రైతులకు దాణా, సంరక్షణ నిమిత్తం వర్కింగ్ క్యాపిటల్ రుణాలు ఇస్తామని చెప్పారు. 7 శాతం వడ్డీతో ఏడాదిలో చెల్లిస్తే వడ్డీ రాయితీ ఉంటుందన్నారు. మూడేళ్ల అయితే 11 శాతం వడ్డీ చెల్లించాలన్నారు. ఆర్‌ఐసీ వీరబ్రహ్మం, అమూల్ సూపర్ వైజర్ వినోద్, సీసీ రామారావు, పంచాయతీ కార్యదర్శి బాలాజీనాథ్, వెటర్నరీ అసిస్టెంట్స్ మనీ కుమార్, వినయ్‌కుమార్, వెంకట్రావు, వీవోఏలు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి క్రీడాకారుల ఎంపిక


చీమకుర్తిలో వాలీబాల్ పోటీలో క్రీడాకారులు

చీమకుర్తి: స్కూలు గేమ్స్‌ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం సంతనూతలపాడు జిల్లాపరిషత్ హైస్కూలులో నియోజకవర్గం స్థాయిలో 17, 14 సంవత్సరాల వయస్సు గల బాల, బాలికలకు వేరు వేరుగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పీడీ బి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను హెచ్‌ఎం, ఎంఈఓలు పర్యవేక్షించారు. ఎంపికైన వారు జిల్లా స్థాయిలో పాల్గొంటారు.


విజయకేతనం చూపుతున్న అపెక్స్ విద్యార్థులు

స్కూల్ గేమ్స్‌లో అపెక్స్ విద్యార్థుల సత్తా

ఒంగోలు: స్థానిక సుజాతానగర్‌లోని అపెక్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఒంగోలు మండల స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో తమదైన శైలిలో సత్తాచాటారు. పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 12,13 తేదీల్లో ఒంగోలు మండల స్థాయి పోటీలు జరిగాయి. కరస్పాండెంట్ కె.శివ కోటిరెడ్డి గురువారం అభినందించారు.

అర్హులందరికీ నూతన పింఛన్లు


అల్లూరులో నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న నేతలు

అల్లూరు (కొత్తపట్నం): అర్హులందరికీ నూతన పింఛన్లు మంజూరు చేస్తున్నామని అల్లూరు సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ అన్నారు. రాజీవ్ కళా మందిర్‌లో గురువారం మాట్లాడుతూ సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, సీనియర్ నాయుకుడు వీరేపల్లి రామాచంద్రారెడ్డి, ఉపసర్పంచ్ తాటిపర్తి సుబ్బారెడ్డి, కో ఆప్షన్ మెంబర్ బాజీ, కన్వీనర్ వీరరాఘవులు, పంచాయతీ కార్యదర్శి హిమబిందు, వెల్‌ఫేర్ అసిస్టెంట్లు అశోక్, రంగనాథ్, పింఛన్ దారులు పాల్గొన్నారు.

12 మందికి నూతన పింఛన్లు

చీమకుర్తి: కేవీ పాలెంలో నూతనంగా మంజూరైన 12 పింఛన్లను జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎలక్ట్రికల్ ఇంజనీర్ షేక్ నజీరుద్దీన్

ఒంగోలు: సోలార్ విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ విధానంపై స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ విద్యార్థినులకు గురువారం అధ్యాపకులు, హైదరాబాద్‌కు చెందిన విండ్ స్ట్రీమ్ కంపెనీ ప్రతినిధులు అవగాహన కల్పించారు. విండ్ స్ట్రీమ్ కంపెనీ ఎలక్ట్రికల్ ఇంజనీర్ షేక్ నజీరుద్దీన్ మాట్లాడారు. సోలార్ విద్యుత్ ఎలా ఉత్పత్తి అవుతుంది, ఆ ఉత్పత్తి అయిన కరెంటు ఎన్ని వాట్స్‌గా వచ్చిందని ఎలా గుర్తిస్తారు, సోలార్ ప్యానళ్లు విద్యుత్‌ను ఎలా ఉత్పత్తి చేస్తాయి, అనే విషయాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి అధ్యక్షత వహించారు. భౌతిక శాస్త్ర అధ్యాపకులు బిట్రగుంట శ్రీనివాసరావు, డాక్టర్ పి.ఇందిర, మంజు భార్గవి పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై సర్వే

పుల్లలచెరువు: మండలంలోని పలు సచివాలయాల పరిధిలో కుష్టు వ్యాధిపై సర్వే చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలపై రాష్ట్ర కుష్టు వ్యాధి నిర్మూలన పరిశీలిన కమిటీ సభ్యుడు డాక్టర్ డి.సాంబిరెడ్డి గురువారం మండలంలోని పలు సచివాలయాలను సందర్శించి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వం ఆదేశాలపై కుష్టు వ్యాధిపై వలంటీర్లు, ఆరోగ్య కార్యకర్తలు సర్వే చేయాలని సూచించారు. కుష్టు వ్యాధిగ్రస్తులకు మనోధైర్యం అందించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కుష్టు వ్యాధిగ్రస్తులకు పూర్తి స్థాయిలో మందులు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలో 12 సచివాలయాల పరిధిలో గురువారం పర్యటించి పలు సూచనలు చేసినట్లు సాంబిరెడ్డి తెలిపారు. ఈయన వెంట పుల్లలచెరువు సీహెచ్‌ఓ అబ్దుల్ జలీల్ ఉన్నారు.

ఇడుపూరులో భూముల రీసర్వే ప్రారంభం

మార్కాపురం రూరల్: జగనన్న శాశ్వత భూహక్కు భూముల రీసర్వేలో భాగంగా మండలంలోని ఇడుపూరు రెవెన్యూ గ్రామంలో గురువారం డ్రోన్ ఫ్లైని ఇడుపూరు, దరిమడుగు సర్పంచ్‌లు వెన్నా మహేశ్వరీ సుబ్బారెడ్డి, బట్టగిరి గౌతమీ గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. సర్పంచ్‌లు మాట్లాడుతూ.. కోట్లాది రూపాయలు వెచ్చించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు సంబంధించిన భూరికార్డులన్నీ డిజిటలైజ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రీసర్వే పూర్తయితే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జవ్వాజి వెంకట రంగారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కె.పేతురు, వీఆర్‌ఓ బడే సాహెబ్, సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఏలు, వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో మెరుగ్గా రాణించాలి

పొదిలి: ప్రభుత్వం క్రీడలకు ఇస్తున్న ప్రోత్సాహాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో మరింతగా రాణించాలని ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. కేజీబీవీ, ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులు పోటా పోటీగా క్రీడల్లో పాల్గొన్నారన్నారు. ఎంఈఓ–2 నాగలక్ష్మి మాట్లాడుతూ.. తాను స్వతహాగా వాలీబాల్ ప్లేయర్‌ను అన్నారు. క్రీడలంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కరీమూన్‌బీబీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బీవీ రెడ్డి, పీడీలు షకీల, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాషువా జయంతి సభను జయప్రదం చేయాలి

దర్శి: గుర్రం జాషువా జయంతి సభను జయప్రదం చేయాలని రాష్ట్ర దళిత సేన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలను గురువారం పంపిణీ చేశారు. స్థానిక ఆర్టీఓ పరిశిపోగు రవికుమార్ చేతులమీదుగా కరపత్రాలు ఆవిష్కరించారు. బీసీ సంక్షేమ సంఘం, పీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ అన్నవరం వెంకటేశ్వరరావు, సంఘ సేవకుడు జీవీ రత్నం మాట్లాడుతూ గుర్రం జాషువా జయంతి సభ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జరుగుతుందని తెలిపారు. దళిత ప్రజాసంఘాల నాయకులు గట్టుపల్లి ప్రసాద్, గర్నెపూడి ప్రేమ్‌కుమార్, అడ్వకేట్ జోషి, గర్నెపూడి ప్రభాకర్, దొంతలూరి కోటేష్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేకు సిద్ధం కండి

తర్లుపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 30వ తేదీ నుంచి అక్టోబరు 30వ తేదీ వరకు నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించేందుకు సిబ్బంది సమాయత్తం కావాలని తర్లుపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె.సింధూజ సిబ్బందికి సూచించారు. గురువారం పీహెచ్‌సీలో మండలంలోని మెడికల్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. వలంటీర్ల సహాయంతో ఏఎన్ఎంలు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి సంబంధిత వివరాలతో కేస్ షీట్లు తయారుచేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హరీష్, సిహెచ్‌ఓ, ఎమ్ఎల్‌హెచ్‌పి, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు

పుల్లలచెరువు: వ్యవసాయ పనులు పలు గ్రామాల్లో ఊపందుకున్నాయి. ఇటీవల అల్పపీడన ప్రభావంతో పలు గ్రామాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. బోరు బావులు, చెరువుల్లో నీరు నిల్వ చేరింది. వ్యవసాయ పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మిరప పంటను అధికంగా సాగు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో చెర్వులకు నీరు రావడంతో వాటి కింద వరి పంటను సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఇప్పటికే గ్రామాల్లో పంటలు సాగు చేయడం ఆలస్యం కావడంతో ప్రస్తుతం పడిన వర్షాలకు అదును దాటి పోతుందోనని, మళ్లీ వర్షాలు పడతాయని ఆశలతో రైతులు పంటలు సాగు చేస్తున్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

గిద్దలూరు రూరల్: వెలుగు వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఓఏల సంఘ నాయకులు స్థానిక ఏపీఎం నరేష్‌ను తన కార్యాలయంలో గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకురాలు గంగాదేవి మాట్లాడుతూ సంవత్సరాల తరబడి గ్రామాల్లో వీఓఏలుగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. కనీస వేతనాలు కల్పించాలన్నారు. గ్రూపు ఇన్సూరెన్స్ రూ.10 లక్షలు కల్పించాలని, లోకాస్ యాప్ వర్క్ చేసేందుకు 5జీ మొబైల్ అందజేయాలని కోరారు. వీఓఏ సంఘ నాయకులు భాగ్యలక్ష్మి, సైదాబీ, మాబునీ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

కొనకనమిట్ల: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత పేర్కొన్నారు. పోషణ మహోత్సవాల్లో భాగంగా గురువారం పెదారికట్ల అంగన్‌వాడీ సెక్టార్ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేసే పథకాలపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల వినియోగంతో కలిగే ఉపయోగాలను వివరించారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాల నిర్వహణపై సూచనలు, సలహాలు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సరస్వతి, లక్ష్మి, షమీమ్, కనకదుర్గ, అంజలి, కోటేశ్వరి, అరుణ, ఏఎన్ఎం ధనలక్ష్మి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళలు తమ కాళ్లపై తాము జీవించాలి

దొనకొండ: గ్రామాల్లోని మహిళలు తమ కాళ్లపై తాము జీవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న పాల వెల్లువ ద్వారా రుణాలు పొందాలని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి కోరారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమం అధికారులు గురువారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ బ్యాంక్‌లు తక్కువ వడ్డీతో గేదెలు కొనుగోలు చేసేందుకు రుణ సౌకర్యం కల్పిస్తున్నారని, ఈ అవకాశాన్ని గ్రామాల్లోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న పాల వెల్లువ సెంటర్లకు తమ బ్యాంక్ నుంచి తక్కువ వడ్డీకే రుణ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలు ప్రభుత్వ కేంద్రాలకు పాలు పోసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వైకేపీ ఏపీఎం జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డైరీ యూనిట్లకు 35 శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ వసంతరావునాయక్ మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగడానికి రుణ సౌకర్యం కలిపిస్తున్నట్లు చెప్పారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


గుండ్లాపల్లి అంగన్‌వాడీ పాఠశాలలో ఎంపీటీసీ పద్మకుమారి, అంగన్‌వాడీ వర్కర్లు

మద్దిపాడు: బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పోషకాహారాన్ని తప్పని సరిగా తీసుకోవాలని, ఎంపీటీసీ పద్మకుమారి అనారు. బుధవారం గుండ్లాపల్లి అంగన్‌వాడీ స్కూల్లో నిర్వహించిన పోషణ మహోత్సవ్ కార్యక్రమంలో ప్రసంగించారు. సూపర్ వైజర్ జయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం టేక్ హోమ్ రేషన్ అందిస్తుందని ప్రతినెలా 1,2వ తేదీల్లో పోషకాహారాన్ని తీసుకుపోవాలని 16,17వ తేదీల్లో పాలు, గుడ్లు ఇస్తామని తెలిపారు. ఏఎన్ఎం రంజాన్‌బీ.. హెచ్‌బీ పర్సెంటేజ్ పెరగడానికి తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. చివరిగా జీఎంఎస్‌కే లీల మాట్లాడుతూ ఆడపిల్లలకు చిన్నతనంలోనే పెండ్లి చేయవద్దని, గ్రామంలో ఎవరైనా బాల్యవివాహాలు జరుపుతుంటే తమకు సమాచారం అందించాలన్నారు. అంగన్ వాడీ వర్కర్లు అనూష, శ్రీదేవి అంజమ్మ, ఆయాలు హాజరయ్యారు.

జగనన్న సురక్షపై అవగాహన


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిషనర్, కౌన్సిలర్లు

చీమకుర్తి: జగనన్న సురక్ష కార్యక్రమంపై గురువారం చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, మెప్మా, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. చీమకుర్తిలో వచ్చేనెల 4వ తేదీన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈనెల 19 నుంచి చీమకుర్తిలో ఇంటింటికీ తిరిగి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించి వచ్చేనెల 4న నిర్వహించే సురక్ష క్యాంపులో వైద్యసేవలందించేందుకు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

పోతురాజు కాలువ పనులు ప్రారంభించాలి


పోతురాజు కాలువను పరిశీలిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: పోతురాజు కాలనీ ఆధునికీకరణ పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఎం ప్రచారజాత డిమాండ్ చేసింది. జిల్లా పాదయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన యాత్రలో భాగంగా రెండో రోజు 1వ డివిజన్ నుంచి 8వ డివిజన్ వరకు ప్రచారం నిర్వహించారు. గురువారం పోతురాజు కాలువను పరిశీలించారు. కాలువలో పూడిక ఉన్నందున వర్షపు నీరు కాలనీలోని రోడ్ల మీద నిలిచి పోయే పరిస్థితి ఉందని తెలిపారు. నగరంలోని శ్మశాన వాటికల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. చీకటి శ్రీనివాసరావు, కె.భూలక్ష్మి, కొర్నె పాటి శ్రీనివాసులు, తంగిరాల మహేష్, బాలకృష్ణ, పి.రవి. ఎస్.హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు తేవాలి


రిలే దీక్షలో ప్రసంగిస్తున్న ఆనాల సురేష్

ఒంగోలు టౌన్: ఈ నెల 18 నుంచి 22 వరకు జరుగనున్న పార్లమెంటు అత్యవసర సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 6వ రోజుకు చేరాయి. తొరటి ఆనంద్, తిరువీధి బాబు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ దీక్షలో వీహెచ్‌పీఎస్ వీహెచ్పీఎస్ జాతీయ కార్యదిర్శ ఆనాల సురేష్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా నిరంతరంగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. జొన్న బాలాజీ, చిప్పలపల్లి సురేష్, పి.రాజేష్ భారతి, జానపాటి సుబ్బారావు, ఇక్బాల్ బాషా, షేక్ జిలాని, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల మార్పు

ఒంగోలు అర్బన్: ఒంగోలు నియోజవర్గానికి సంబంధించి ఒంగోలు పట్టణంలో ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గురువారం పరిశీలించి పలు పోలింగ్ కేంద్రాలను మార్పు చేశారు. సీఎస్ఆర్ శర్మ కాలేజీలోని 182వ పోలింగ్ కేంద్రాన్ని ఎన్‌జీఓహోంకు, సాంఘిక సంక్షేమ హాస్టల్‌లోని 173వ పోలింగ్ కేంద్రాన్ని అంబేడ్కర్‌భవన్‌కు మార్చారు. హెచ్‌సీఎం హైస్కూల్‌లో ఉన్న 126,127,128 బూత్‌ల్లో ఓట్లు ఎక్కువగా ఉన్న కారణంతో అదే స్కూల్‌లో మరో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. బండ్లమిట్ట ప్రభుత్వ బాలికల పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. దీనిలో వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు బిసినేపల్లి రాజశేఖర్, గుర్రం సత్యం, రసూల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీతోనే పీఎం కిసాన్ లబ్ధి

తాళ్లూరు (ముండ్లమూరు): పంట సాగు చేసిన రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని రెడ్డిసాగర్‌లో ఈకేవైసీ పెండింగ్ ఉన్న రైతుల వద్దకు వ్యవసాయ సిబ్బంది వెళ్లి గురువారం ఈకేవైసీ చేయించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే నెలలో రైతులకు పీఎం కిసాన్ నిధులు వస్తున్నందున అర్హతగల రైతులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. వీఏఏలు శ్రీను, సుల్తాన, ఏఈఓ నాగరాజు పాల్గొన్నారు.

నేడు 'నీ గానమే నా ప్రాణం'

యర్రగొండపాలెం: స్థానిక వినుకొండ రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం నీ గానమే నా ప్రాణం అఖండ భజన కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 5 గంటలకు కాషాయ ధ్వజారోహణంతో కార్యక్రమాలు ప్రారంభం అవుతాయి. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు దేశ్‌పాండే, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి వాసు, ప్రచార కార్యదర్శి హరినారాయణ, కోశాధికారి రంగాచారి, జిల్లా అధ్యక్షుడు శంకరరావు, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు డప్పు శ్రీను పాల్గొంటారని పేర్కొన్నారు. అఖండ భజన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇప్పటి వరకు 20 ఎంట్రీలు వచ్చాయని, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

రాచర్ల: మండలంలోని యడవల్లి సచివాలయం పరిధి అంకిరెడ్డి పల్లె, యడవల్లి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 11 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యేలం మురళీకృష్ణ గురువారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పాల్గొంటారని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మండలంలోని జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.